క్లుప్తంగా

వేలంలో రూ.22 వేలు ఆదాయం

శ్రీరంగరాజపురం: వివిధ కేసుల్లో స్వాధీనం పట్టుబడిన వాహనాలను వేలం వేయగా రూ.22 వేలు ఆదాయం వచ్చినట్లు ఎస్‌ఐ షెక్షావలి తెలిపారు. గురువారం 6 వాహనాలను వెహికల్ ఇన్‌స్పెక్టర్ నిర్ణయించిన ధరలకు వేలం వేశామని, కేవలం 2 వాహనాలు మాత్రమే అమ్ముడుపోయినట్లు చెప్పారు. ఈ వేలం ద్వారా రూ.22 వేలు ప్రభుత్వానికి ఆదాయం వచ్చిందన్నారు. మిగిలిన వాహనాలను త్వరలో వేలం నిర్వహిస్తామన్నారు.

తాగునీటి పైపులైనుకు మరమ్మతులు



మరమ్మతు చేపట్టిన పైపులైను

విజయపురం: మండలంలోని మల్లారెడ్డికండ్రిగ ఆదిఆంధ్రవాడకు మంచినీరు సరఫరా చేసే పైపులైను వారం క్రితం మరమ్మతులకు గురైంది. స్థానికుల ద్వారా విషయం తెలిసి గ్రామ సర్పంచ్ శాంతి గురువారం పైపులైను మరమ్మతులు చేయించి తాగునీటి సరఫరాను పునరుద్ధరింపజేశారు. అలాగే అక్కడక్కడ మరమ్మతులకు గురైన కొళాయి పైపులను కూడా సరి చేశారు. దీంతో స్థానిక ప్రజలు సర్పంచ్‌ను అభినందించారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి




మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీవైఈఓ చంద్రశేఖర్‌రెడ్డి

గంగాధరనెల్లూరు: ఈ ఏడాది 10వ తరగతి పరీక్షల్లో విద్యార్థులు నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలని చిత్తూరు డీవైఈఓ చంద్రశేఖర్‌రెడ్డి ఆదేశించారు. మండలంలోని తూగుండ్రం జెడ్పీ ఉన్నత పాఠశాలను గురువారం తనిఖీ చేసి సూచనలు చేశారు. విద్యలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వారి కోసం ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని సూచించారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

గంగాధరనెల్లూరు: మండలంలోని సరివిరెడ్డిపల్లి సమీపంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో ఐదవ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవచ్చని ప్రిన్సిపల్ దమయంతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2022–2023 విద్యా సంవత్సరంలో నాలుగో తరగతి విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు అర్హులన్నారు. ఏపీజీపీసెట్ ఏపీసీఎఫ్ఎస్ఎస్.డాట్‌ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ విద్యార్థినులు ఈనెల 24వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కులధ్రువీకరణపత్రం, ఆధార్, ఫోన్ నంబరు పొందుపరచాలని పేర్కొన్నారు.

ఎంఈఓగా శంకరయ్య



వెదురుకుప్పం: మండల విద్యాశాఖ అధికారిగా శంకరయ్య గురువారం బాధ్యతలు చేపట్టారు. తవణంపల్లె ఎంఈఓగా విధులు నిర్వహిస్తున్న ఈయన జిల్లా అధికారులు వెదురుకుప్పం ఎంఈఓగా బదిలీ చేశారు. ఇంతకుముందు కార్వేటినగరం ఎంఈఓ విజయకుమార్ ఇన్‌చార్జ్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో విద్యాభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించి, అంకిత భావంతో పని చేయాలన్నారు. ఈ క్రమంలో భాగంగా పలువురు ఉపాధ్యాయ సంఘ నేతలు కలసి ఘనంగా సన్మానించారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు



రోడ్డుపై రక్త గాయాలతో ముత్తు

నగరి: తిరుపతి చెన్నై జాతీయ రహదారిలో గుండ్రాజుకుప్పం వెళ్లే రోడ్డు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముత్తు (59) అనే వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. గురువారం రాత్రి కనంమిట్టకు చెందిన ముత్తు ద్విచక్ర వాహనంలో వెళ్తూ గుండ్రాజుకుప్పం వెళ్లే మార్గ సమీపంలో జాతీయ రహదారిపై నిలిచి ఉన్న లారీని ఢీకొట్టాడు. దీంతో అతని తలకు, కాలికి తీవ్రగాయాలయ్యాయి. అతన్ని వెంటనే స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం ఉన్నత వైద్యసేవల నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు.

దస్తూరితోనే ఉజ్వల భవిష్యత్..

- మెరుగైన మార్కులు సాధించాలంటే చేతిరాత ముఖ్యం
- పది విద్యార్థులు చేతిరాతపై దృష్టి పెట్టాలంటున్న నిపుణులు

ఎవరికైనా వారి చేతిరాత బాగుంటే తలరాత బాగుంటుంది అనడంలో సందేహం లేదు. ఎవరినైనా ఆకర్షించేంది చేతిరాతే. అందువల్ల అక్షరాలు అందంగా రాయగలిగితే జీవితం బాగుంటుంది. త్వరలోనే పదో పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థులు బాగా చదవడంతో చదివిన అంశాలను పేపర్‌పై అందంగా రాయగలిగినప్పుడే మంచి మార్కులు సాధించగలుగుతారు. పేపర్‌పైన రాసింది ఉపాధ్యాయులకు అర్థం కాకపోతే ఎంతరాసిన వృథానే. ఈ నేపథ్యంలో పదో తరగతి విద్యార్థులు తమ చేతిరాతపై కూడా దృష్టి పెట్టాలని నిపుణులు సూచిస్తున్నారు.



బలిజకండ్రిగ జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు చేతిరాతపై శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయులు

పాలసముద్రం: పబ్లిక్ పరీక్షల సమయం ఆసన్నం కావడంతో పదో తరగతి విద్యార్థుల ధ్యాస అంతా ఇప్పుడు చదువుపైనే. అయితే విద్యార్థులు పరీక్షల్లో సమాధానాలను ఉన్నది ఉన్నట్టుగా రాసినా దస్తూరి ఎంత బాగుందన్నదే ముఖ్యం. ఏం రాశామన్నది పేపర్ మూల్యాంకనం చేసే వ్యక్తికి అర్థమైతేనే ఎక్కువ మార్కులు వచ్చే అవకాశం ఉంటుంది. లేదంటే కష్టమంతా వృథా అవుతుంది. గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో 58 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. అందులో 2,558 మంది విద్యార్థులు ఈసారి పదో పరీక్షలు రాయనున్నారు. ఏడాదిపాటు చదివిన అంశాలను మూడు గంటల్లో ఆన్సర్ షీట్‌పై రాయాలి. పరీక్షల సమయంలో సహజంగా ఆందోళన ఉంటుంది. మొదటి ప్రశ్నకు సమాధానం చక్కగా రాసి తర్వాత వేగం పెరిగడంతో కొందరు సరిగా రాయలేకపోతుంటారు. దీన్ని అధిగమించాలంటే ముందుగానే దస్తూరిపై సాధన చేస్తే పరీక్షలో ఇబ్బందులు ఉండవని నిపుణులు అంటున్నారు. అందులో భాగంగా బలిజకండ్రిగ జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు తమ విద్యార్థులు పరీక్షల్లో చేతిరాత బాగుండేలా ముందు నుంచే శిక్షణ ఇస్తున్నారు.

మండలం పేరు	హైస్కూలు	విద్యార్థులు	మండలం పేరు	హైస్కూలు	విద్యార్థులు
గంగాధరనెల్లూరు	16	655	శ్రీరంగరాజుపురం	8	395
కార్వేటినగరం	12	497	వెదురుకుప్పం	9	401
పెనుమూరు	7	385	పాలసముద్రం	6	225

జాగ్రత్తలు తీసుకుంటే చాలు..

- పరీక్షల్లో సమాధాన పత్రంలో రాసే జవాబు సూటిగా ఉండడంతో పాటు అక్షరాలు పొందికగా ఉంటే పేపరు దిద్దేవారు మార్కులు అదనంగా వేసే అవకాశం ఉంది.
- సామాన్య, భౌతిక శాస్త్రాల్లో బొమ్మలు గీసి భాగాలు గుర్తించే విషయంలో పెన్నును ఒత్తిపెట్టి రాయకూడదు. ఇలా చేస్తే పేపరు వెనుక అచ్చు పడి అక్షరాలు సక్రమంగా కనిపించవు. దీనివల్ల మూల్యాంకనం చేసే వ్యక్తి సరిగా చూడరు.
- పేజీకి పదహారు నుంచి ఇరవై మించి లైన్లు రాయకూడదు.
- రోజూ కొద్ది సమయం సాధన చేస్తే పరీక్షలలో ఆందోళన లేకుండా సాఫీగా రాయవచ్చు.
- పెన్ను సక్రమంగా పట్టుకుని రాస్తే రాసే అక్షరాలు మనకు కనిపించడంతో పాటు అక్షరాలు గుండ్రంగా ఉంటాయి.

ప్రాధాన్యం పెరుగుతోంది..



శాస్త్ర, సాంకేతిక రంగం ఎంత ఎదిగినా చేతి రాతకు ప్రాధాన్యం పెరుగుతూనే ఉంది. సంబంధిత భాషపై పట్టు ఉంటే రాయడం తేలిక అవుతుంది. దస్తూరి బాగున్న విద్యార్థులు అదనంగా మార్కులు పొందేందుకు అవకాశం ఉంటుంది. మా పాఠశా లలో విద్యార్థులకు చేతిరాతపై తర్ఫీదు ఇస్తున్నాం.

–గణపతి, ఆముదాల జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం

చేతిరాతపై శిక్షణ ఇచ్చారు



మనం ఎంత చదివి రాసినా అది ఉపాధ్యాయులకు అర్థం కాకపోతే ఫలితం ఉండదు. మనం చక్కగా రాస్తేనే మంచి మార్కులు వస్తాయి. అందువల్ల అక్షరాలు గుండ్రంగా రాయాలని ప్రతి రోజు ఉపాధ్యాయులు శిక్షణ ఇస్తున్నారు. ఇలా శిక్షణ ఇవ్వడం వల్ల మేము చక్కగా రాస్తున్నాం.

–చందు, ఆముదాల, జెడ్పీ హైస్కూల్ విద్యార్థి

అలా రాస్తే అదనపు మార్కులు

అదనపు మార్కులు రావాలంటే చేతిరాత చాలాముఖ్యం. చేతి రాతను బట్టి విద్యార్థి సామర్థ్యాన్ని అంచనా వేయవచ్చు. పాఠశాల సముదాయ సమావేశాల్లో ఇదే విషయాన్ని అధికారులు స్పష్టం చేస్తున్నారు. విద్యార్థి రాసే సమాధానంతోనే కాదు చేతిరాత బాగుంటే కూడా మార్కులు వేస్తారు.

–రమేష్ బాబు, బలిజకండ్రిగ స్కూల్ సైన్స్ టీచర్

మంచి మార్కుల కోసం..



ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు మంచి మార్కులు సాధించాలన్న లక్ష్యంతో విద్యార్థుల అక్షరాలపై టీచర్లు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. పరీక్షల్లో అక్షరాలు గుండ్రంగా రాస్తేనే పేపర్ మూల్యాంకనం చేసే వ్యక్తికి అర్థమైనే మంచి మార్కులు వస్తామని ఉద్దేశంతో చేతిరాతపై విద్యార్థులకు శిక్షణ పొందారు.

–రాజేంద్రప్రసాద్, ఎంఈఓ, పాలసముద్రం

ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి



విజయపురం : పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న సిబ్బంది

విజయపురం: మండల కేంద్రం విజయపురం ఎంపీడీఓ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు జయంతిని గురువారం కార్యాలయ సిబ్బంది ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. సిబ్బందికి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సతీష్, పంచాయతీ కార్యదర్శి బాబు, సురేంద్రకుమార్, సంపూర్ణ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



మజ్జిగ అందిస్తున్న యువకులు

పాలసముద్రం: మండలంలోని శ్రీకావేరిరాజుపురంలో బలిజకండ్రిగ–చిత్తూరు జాతీయ రహది పక్కన గురువారం అంబేడ్కర్ యువజన సంఘ యువకులు చలివేంద్రం ప్రారంభించారు. యువకులు మాట్లాడుతూ ప్రస్తుతం ఎండల తీవ్రత ఎక్కువ కావడంతో పాదచారులు, ద్విచక్రవాహనదారులు దాహంతో ఇబ్బంది పడుతున్నారన్నారు. అలాంటి సమయంలో రోడ్డు పక్కన ఉన్న చలివేంద్రం ఉంటే అందువల్ల నీరు తాగి దాహం తీర్చుకుని కాసేపు విశ్రాంతి తీసుకుని వెళ్తారని తెలిపారు. అందువల్ల యువకులే నగదు వేసుకుని ప్రతిరోజు చలివేంద్రానికి తీసుకొచ్చి పోయడానికి ఒక వ్యక్తిని నియమించారు. అనంతరం రోడ్డుపై వాహనదారులకు మజ్జిగ ఇచ్చి చలివేంద్రం ప్రారంభించారు. కార్యక్రమంలో జయకుమార్, ఉమేష్, సుబ్రమణ్యం, వెంకటేశన్, బాలమురుగన్, చిన్నబ్బ పాల్గొన్నారు.

చెరువుల్లో పూడికతీతతో భూగర్భ జలాల పెంపు



కూలీలతో మాట్లాడుతున్న ఉపాధిహామీ పథకం సంచాలకులు గంగాభవాని

పాలసముద్రం: మండల పరిధిలో అమృత్ సరోవర్ పథకంలో భాగంగా చేపడుతున్న చెరువుల్లో పూడిక తీత పనులతో భవిష్యత్ తరాలకు నీటి సంరక్షణతో పాటు భూగర్భ జలాలు పెరుగుతాయని ఉపాధి హామీ పథక సంచాలకులు గంగాభవానీ తెలిపారు. గురువారం ఆమె గంగమాంబపురం పంచాయతీలో చెరువుల్లో జరుగుతున్న పనులను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కూలీలతో ఆమె మాట్లాడుతూ అమృత్ సరోవర్‌లో చెరువులో చేస్తున్న నీటి కుంటల వల్ల జంతువులు, పశువులకు నీటి సౌకర్యం లభిస్తుందన్నారు. చెరువుల అభివృద్ధి, పునరుద్ధరణ, రైతులకు సాగు నీటి వసతి, కూలీలకు ఉపాధి, మట్టి రవాణా ద్వారా వాహనదారులకు ఆదాయం వస్తుందన్నారు. అలాగే పొలాల్లో పూడిక మట్టి చల్లడం వల్ల భూసారం పెరుగుతుందని తెలిపారు. మస్టర్లు కొట్టివేతలు లేకుండా హాజరు వేయాలని సూచించారు. ఉపాధిహామీ పథకంలో అవకతవకలు జరిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విద్యావతి, ఏపీఓ బాల, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

'సహకార బంధు'ను సద్వినియోగం చేసుకోండి



రైతులకు అవగాహన కల్పిస్తున్న కళాబృందం సభ్యులు

నగరి: సహకార బ్యాంకులు, సహకార సంఘాలు అందించే వివిధ పథకాల గురించి కళాబృందం వారిచే రైతులకు గురువారం స్థానిక సహకారసంఘ కార్యాలయంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నగరి బ్రాంచ్ మేనేజరు సందీప్ మాట్లాడుతూ ×సహకారబంధు పథకం ద్వారా డిపాజిట్లపై వాణిజ్య బ్యాంకుల కన్నా అధిక వడ్డీ రేట్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ అవకాశం ఈ నెల 20 వరకు మాత్రమే ఉంటుందన్నారు. డిపాజిట్‌దారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎఫ్ఎల్‌సీ కోఆర్డినేటరు హేమప్రకాష్ మాట్లాడుతూ బ్యాంకువారు అందించే వివిధ రకాల రుణ సదుపాయాలను రైతులకు వివరించారు. బ్యాంకు సూపర్ వైజరు ఓ.ఆనందన్ మాట్లాడుతూ స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలకు మార్చి 31 వరకు మాత్రమే వడ్డీకి అపరాధపు వడ్డీమాఫీ వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో నగరి పీఏసీఎస్ డైరెక్టరు దామోదరం నాయుడు, సీఈఓ కె.తులసి పిళ్లై, బ్యాంకు సూపర్ వైజర్ కార్తీక్, సంఘం సిబ్బంది గుణశేఖర్, శేఖర్, లేపాక్షి, తనికాచలం, అప్రైజర్ కార్తీక్, రైతులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్‌కు జ్ఞానసాయి ఎంపిక



జిల్లాస్థాయి అవార్డుకు ఎంపికైన జ్ఞానసాయిని అభినందిస్తున్న హెచ్‌ఎం కేశవులు

కార్వేటినగరం: మండలంలోని గంగమాంబాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి జ్ఞానసాయి జిల్లాస్థాయి అవార్డుకు ఎంపికైనట్లు హెచ్‌ఎం కేశవులు తెలిపారు. గురువారం అధునాతన (స్మార్ట్ ఆర్మీ)సైనిక విధానంపై ఎగ్జిబిషన్‌లో విద్యార్థి జ్ఞానసాయి ప్రతిభ కనబరిచినట్లు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థితో పాటు శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయుడు గుణశేఖర్‌ను హెచ్‌ఎం అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2021–22 సంవత్సరానికి జిల్లాస్థాయిలో నిర్వహించిన ఎగ్జిబిషన్‌లో ప్రతిభ చూపి ఇన్‌స్పైర్ అవార్డు అందుకున్న తమ పాఠశాల విద్యార్థి రాష్ట్రస్థాయిలో జరిగే ఎగ్జిబిషన్‌కు కూడా ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు. ప్రతి విద్యార్థి జ్ఞానసాయిని ఆదర్శంగా తీసుకుని ప్రతిభ చూపాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుటుంబ నియంత్రణపై అవగాహన



ఆశా వర్కర్లకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి ప్రవీణ

వెదురుకుప్పం: కుటుంబ నియంత్రణ పద్ధతులను పాటించాలని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ అన్నారు. గురువారం మండలంలోని పచ్చికాపల్లంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఆశావర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రిలోనే ప్రసవం చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లో పరిశుభ్రత నిర్వహణకు సంబంధించి ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ప్రతిఒక్కరూ వ్యకిగత పరిశుభ్రత పాటించేందుకు కృషి చేయాలని చెప్పారు. దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా గ్రామాల్లో మురుగు నీరు నిల్వ లేకుండా చూడాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు విధిగా తీసుకునేలా ప్రజల్లో చైతన్యం తీసుకు రావాలన్నారు. ఆల్బెండజోల్ మాత్రల వల్లఎలాంటి దుష్ప్రభావం ఉండవని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీహెచ్ఓ వెంకటరమణయ్య, పర్యవేక్షకులు, ఆశావర్కర్లు, పలువురు పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి వితరణ




క్రీడాసామగ్రి అందజేస్తున్న సర్పంచ్ విద్య

విజయపురం: మండలంలోని కాళియంబాకం దళితవాడ క్రీడాకారులకు గ్రామ సర్పంచ్ విద్యాభాస్కర్‌రెడ్డి క్రీడాసామగ్రి వితరణ చేశారు. గురువారం ఫుట్‌బాల్, వాలీబాల్, బ్యాడ్మింటన్ కిట్, క్రికెట్ కిట్‌ను క్రీడాకారులకు అందజేశారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారులు తమ నైపుణ్యాన్ని పెంపొందించుకోవడానికి తాను సామగ్రి అందజేశానన్నారు. రానున్న రోజుల్లో క్రీడాకారులకు మరింత సాయం అందజేస్తానని ఆమె తెలిపారు. కార్యక్రమంలో శేఖర్‌రెడ్డి, రామరాజు, మాణిక్యం, విజయుడు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఎస్వీసీఈలో జాతీయ సదస్సు ప్రారంభం

తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతి–కరకంబాడి రోడ్డులోని ఎస్వీసీఈ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం భౌతిక, రసాయన శాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో నానో స్ట్రక్చర్డ్ మెటీరియల్స్ టు బ్యాటరీ అండ్ సూపర్ కెపాసిటర్స్(ఎన్‌ఎంబీఎస్–2023) అన్న అంశంపై జాతీయ స్థాయి సదస్సు ప్రారంభమైంది. ఇందులో ముఖ్యఅతిథులుగా తిరుపతి ఐసర్ రసాయన శాస్త్ర విభాగపు డీన్ ప్రొఫెసర్ విజయమోహన్ కె.పిళ్లై, బెంగళూరులోని రేవ యూనివర్సిటీ రసాయన శాస్త్ర విభాగపు ప్రొఫెసర్ డిహెచ్.నాగరాజులు పాల్గొని మాట్లాడారు. పెరుగుతన్న కాలుష్యాన్ని, వనరుల కొరతను నియంత్రించడంలో బ్యాటరీ ఆధారిత వాహనాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. తద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు కార్బన్ రహిత సమాజాన్ని స్థాపించవచ్చని తెలిపారు. సదస్సులో ప్రిన్సిపాల్ ఎస్.సుధాకర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ టి.చంద్రశేఖర్‌రావు, విభాగాధిపతి ఎస్.మనోహర్ రెడ్డి, కన్వీనర్ పి.బాబు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ సెకండియర్ పరీక్షలు



నగరి సెకండియర్ పరీక్షకు హాజరైన విద్యార్థులు

నగరి: ఇంటర్ సెకండియర్ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు తెలుగు, తమిళం, సంస్కృతం పరీక్షలు జరిగాయి. ఉదయం 8.45 గంటల కంతా విద్యార్థులు పరీక్ష కేంద్రానికి చేరుకున్నారు. 9 గంటల నుంచి 12 గంటల వరకు పరీక్ష జరిగింది. పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు స్క్వాడ్ బృందం కేంద్రాల్లో పర్యటించింది. కాపీయింగ్‌కు అవకాశం లేకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. తొలిరోజు పరీక్షకు మండలంలో 909 మంది విద్యార్థులకు గాను 897 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. 12 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

పుత్తూరులో..

పుత్తూరు రూరల్: ఇంటర్ సెకండియర్ పరీక్షలు పుత్తూరు పట్టణంలోని ఐదు సెంటర్లలో గురువారం ప్రశాంతంగా జరిగింది. బాలికల జూనియర్ కళాశాలలో 335 మందికి గాను 325 మంది హాజరయ్యారు. సాయిజ్యోతి జూనియర్ కళాశాలలో 268 మందికి గాను 264 మంది హాజరయ్యారు. హిమజ జూనియర్ కళాశాలలో 315 మందికి గాను 305 మంది హాజరయ్యారు. శేషాచల జూనియర్ కళాశాలలో 313 మందికి గాను 306 మంది హాజరయ్యారు. ఎస్ఆర్ఎస్ బాలుర జూనియర్ కళాశాలలో 327 మందికి గాను 323 మంది హాజరయ్యారు. మొత్తం ఐదు సెంటర్లలో 1,558 మంది విద్యార్థులకు గాను 1526 మంది హాజరుకాగా 32 మంది గైర్హాజరయ్యారు.

వేసవి దుక్కులతో భూసారం పెంపు



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ డిల్లీప్రసాద్

పాలసముద్రం: మండల పరిధిలోని రైతన్నలు వేసవి దుక్కులు చేయడంలో చీడపీడలను నియంత్రించవచ్చని ఏఓ డిల్లీప్రసాద్ తెలిపారు. గురువారం ఆముదాల పంచాయతీలో రైతులు సాగు చేసిన పంటలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి దుక్కులు చేపట్టడానికి మార్చి, ఏప్రిల్ మాసాలు అనువైనవన్నారు. ఇప్పుడు దుక్కులు చేపట్టడం వల్ల వేరుకుళ్లు తెగులును కలిగించే సిలీంద్ర సిద్ధ బీజాలు నిరంతరం భూమి అడుగుభాగానే ఉంటాయని, వర్షం పడగానే విజృంభించిన పంటను నాశనం చేస్తాయన్నారు. అదేవిధంగా భూమి అడుగు భాగాన ఉన్న గడ్డి మూలాలు వర్షం పడగానే పెరిగిన పంటను దెబ్బతీస్తాయి. వీటిని నివారించడానికి వేసవి సమయంలో పొలాల్లో ఒకటిన్నర అడుగు లోతు వరకు రెండు మడకలతో వేసవి దుక్కులు చేపట్టాలని తెలిపారు. దీనివల్ల భూమి లోపల ఉన్న సిలీంద్ర సిద్ధ బీజాలతో పాటు, గడ్డి మూలాలు కూడా బయటకు పడి అధిక ఉష్ణోగ్రతకు నశించిపోతాయన్నారు. వేసవి దుక్కులతో భూమి వదులుగా మారి వర్షం పడినప్పుడు గాలి, నీరు, ఉష్ణోగ్రత సమానంగా ఇంకిపోయి విత్తనాలు మొలకెత్తడానికి అనుకూలంగా ఉంటుందని తెలిపారు. అనంతరం ఎకరాకు రెండు టన్నుల చొప్పున పశువుల ఎరువు పొలాల్లో చల్లుకోవాలని తెలిపారు. దీంతో పంటకు కావాల్సిన సూక్ష్మపోషకాలు కూడా సమృద్ధిగా అందుతాయన్నారు. మార్చి రెండు వారం నుంచి మే మొదటి వారం వరకు వేసవి దుక్కులు చేపట్టడానికి అనుకూలమని తెలిపారు. కార్యక్రమంలో విలేజ్ అగ్రికల్చర్ ఆఫీసర్ నెడుంజేలన్, రైతులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్లు బాధ్యతగా పని చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ వసంతి

పాలసముద్రం: మండల పరిధిలోని ఆశా కార్యకర్తలు గ్రామాల్లో పర్యటించి తమ పని బాధ్యతను సక్రమంగా చేయాలని వైద్యాధికారి వసంతి తెలిపారు. గురువారం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఆశా కార్యకర్తలకు, ఆరోగ్య సిబ్బందికి ఆమె సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఆశా కార్యకర్తలు గర్భిణులు ప్రసవం వరకు వారికి అందుబాటులో ఉండాలన్నారు. ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు గ్రామాల్లో పర్యటించి ప్రజలకు ప్రస్తుతం ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున వడదెబ్బలు తగిలే అవకాశం ఉందన్నారు. గర్భిణులు బయటకు వచ్చేటప్పుడు గొడుగు సహాయంతో బయటకు రావాలని అవగాహన కల్పించాలని తెలిపారు. అందువల్లఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండాలని సూచించారు. దోమలు వృద్ధి చెందకుండా మలాథిన్ మందులు పిచికారీ చేయాలని తెలిపారు. ప్రసవం ప్రభుత్వం ఆస్పత్రిలో చేయించాలని హెచ్చరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సుశీల, మురళి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

స్విమ్స్ వైద్య విద్యార్థులకు అవార్డులు

తిరుపతి తుడా: మహారాష్ట్రలోని డాక్టర్ ఎబీజె అబ్దుల్‌కలామ్ కాలేజీ ఆఫ్ ఫిజియోథెరపీలో ఈనెల 11వ తేదీ వరకునిర్వహించిన జాతీయ సదస్సులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అవార్డులను ప్రకటించారు. శాస్త్రీయ పోస్టర్ ప్రదర్శనలో తృతీయ బహుమతితోపాటు మరో ఐదు బహుమతులు, వాలీబాల్ క్రీడలో ద్వితీయ, డ్యాన్స్‌లో రెండు, సింగింగ్‌లో ఒకటి, బ్యాడ్మింట్‌లో మూడు బహుమతులు కైవసం చేసుకున్నట్టు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ తెలిపారు.

మున్సిపల్ పన్ను బకాయిలపై వడ్డీ రద్దు



నగరి మున్సిపల్ కార్యాలయం

- ఈ నెల 31లోపు చెల్లించాలంటూ గడువు
- జీఓ విడుదల చేసిన ప్రిన్సిపల్ సెక్రటరీ

నగరి: మున్సిపాలిటీలో వసూలు కావలసిన పన్నులు కోవిడ్ పాండమిక్ పీరియడ్‌లో రాష్ట్రస్థాయిలో చాలా వరకు వసూలు కాక బకాయిలు పేరుకుపోయాయి. మున్సిపల్ యాక్ట్ 1965 సెక్షన్ 91, మున్సిపల్ కార్పొరేషన్ యాక్ట్, 1955 సెక్షన్ 269(2) మేరకు ఆ బకాయిలపై నెలకు 2 శాతం వడ్డీలను విధించడంతో నివాసితులు ఆ బకాయిలను చెల్లించలేని పరిస్థితి ఎదురైంది. దీంతో అధికారులు ఈ సమస్యను కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ దృష్టికి తీసుకెళ్లారు. వీటిని పరిగణనలోకి తీసుకున్న ఆ శాఖ ఉన్నతాధికారులు కోవిడ్ తీవ్రత ఉన్న కాలంలో పేరుకుపోయిన బకాయిలపై నిబంధనల మేరకు పన్ను విధిస్తే అది మరింత పెద్దమొత్తంగా మారి వసూలు కాని పరిస్థితి తలెత్తుతుందని, ప్రభుత్వం బకాయిలపై వడ్డీని రద్దు చేయాలని ప్రభుత్వానికి లేఖ ద్వారా తెలియజేశారు. ఈ అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వై.శ్రీలక్ష్మి 2022–23 సంవత్సరం వరకు రద్దు చేస్తున్నామని, అయితే ఈ నెల 31లోపు బకాయి ఉన్న పన్నులు, ప్రస్తుత సంవత్సరానికి చెందిన పన్నులు పూర్తిగా చెల్లించాలని జీఓ ఎంఎస్ నంబరు 34 మేరకు గురువారం ఆదేశాలను జారీ చేసింది. ఇలాంటి అవకాశం మళ్లీ రాదని పురపాలిక ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని వడ్డీలు లేకుండా బకాయి ఉన్న పన్నులు చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.